అశోక్‌కు జేఎన్‌టీయూ డాక్టరేట్



అంబర్‌పేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నల్గొండకు చెందిన ఎస్.అశోక్‌కు జేఎన్‌టీయూ డాక్టరేట్ లభించింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంకు చెందిన ఎస్.అశోక్ జేఎన్‌టీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ప్రొఫెసర్ ఎస్ఎస్ దిలీప్ ఆధ్వర్యంలో ఎఫెక్ట్ ఆఫ్ వేరిడ్ ట్రైనింగ్ డిజైన్స్ ఆన్ జనరల్ మోటార్ ఎబిలిటీ అమంగ్ ఇంటర్ కాలేజ్ ఏటీఈ బాస్కెట్ బాల్ ప్లేయర్స్ ఎట్ హైదరాబాద్ అంశంపై పరిశోధన చేసినందుకు ఆయనకు డాక్టరేట్ లభించింది. ఇటీవల జరిగిన జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో ఇస్రో డైరెక్టర్ ఎస్పీ సోమనాథ్ జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నరసింహారెడ్డి ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఉపకారవేతనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కార్మికసంక్షేమ మండలి అమలు చేస్తున్న పథకాలలో భాగంగా కార్మికుల పిల్లలకు ఉపకారవేతనాలు అందజేస్తున్నట్లు అసిస్టెంట్ లేబర్ కమిషనర్లు జీబీఎన్ స్వామి, ఎ.సత్యనారాయణరెడ్డి, ఎన్.వెంకటరమణ తెలిపారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని కార్మిక కమిషనరేట్‌లోని వారి కార్యాలయంలో మాట్లాడుతూ 2022-23 విద్యాసంవత్సరంలో ప్రతిభ ఆధారంగా ఉపకారవేతనాలు అందిస్తామని తెలిపారు. కార్మికశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 15వరకు దరఖాస్తులను సమర్పించడానికి అవకాశంఉందన్నారు. 10వ తరగతి, ఐటీఐలలో ఉత్తీర్ణులైన వారికి రూ.1,000, పాలిటెక్నిక్ రూ.1500, ఇంజనీరింగ్, మెడిసిన, లా, బీఎస్సీ బీసీఏ, ఎంసీఏ, బీఫార్మసీ తదితర కోర్సులు పూర్తిచేసినవారికి రూ.2,000 అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏసీఎల్‌లు సూచించారు.

18న గ్రేటర్‌లో ఎన్టీఆర్ వర్ధంతి

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ.రామారావు వర్ధంతి కార్యక్రమాన్ని ఈ నెల 18న గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా తెలిపారు. ఎన్టీఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులర్పించడం, అన్నదానం, పండ్ల పంపిణీ, వైద్య శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఆ రోజు ఉదయం 9 గంటలకు ఎన్టీఆర్ కుమార్తె నారా భువనేశ్వరి నివాళులర్పిస్తారని, 10 గంటలకు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో రక్తదాన కార్యక్రమం, దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి దేవస్థాన కమిటీ సభ్యులుగా మధుసూదన్



కవాడిగూడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి దేవస్థాన కమిటీ సభ్యులుగా కవాడిగూడకు చెందిన బండారు మధుసూదన్ నియమితులయ్యారు. ఈ మేరకు దేవస్థాన కమిటీ సభ్యులను దేవాదాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్‌శర్మ ప్రకటించారు. సోమవారం కవాడిగూడలో బండారు మధుసూదన్ విలేకరులతో మాట్లాడుతూ కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన మంత్రి కొండా సురేఖ, చైర్మన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

టీఎస్ కేబుల్ టీవీ యాజమాన్యాల కోర్ కమిటీ ఎన్నిక

బర్కత్‌పుర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కేబుల్ టీవీ యాజమాన్యాల కోర్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కోర్ కమిటీని ఎన్నుకున్నారు. కోర్ కమిటీ సభ్యులుగా కె.కోటేశ్వరరావు, హెచ్.వి.చలపతిరాజు, అనంచిన్ని వెంకటేశ్వరరావు, ఎం.రవికుమార్, కృష్ణంరాజు, జితేందర్, దేవేందర్, రవీందర్, సాజితాసికిందర్, సీహెచ్ శ్రీనివాస్‌రావు, బ్రహ్మం, గిరి, రవికుమార్ తదితరులను ఎన్నుకున్నారు.

బీజేపీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్‌గా సూర్యప్రకాష్



సూర్యప్రకాష్‌కు నియామక పత్రం అందజేస్తున్న ప్రేమేందర్‌రెడ్డి

నల్లకుంట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్‌గా నల్లకుంట డివిజన్‌కు చెందిన సూర్యప్రకాష్ అన్నాజుల నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి సోమవారం పార్టీ కార్యాలయంలో సూర్యప్రకాష్ అన్నాజులకు నియామకపత్రం అందించారు. ఈ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడిగా రవీందర్‌గౌడ్



గోల్నాక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడిగా కన్వీనర్‌గా కొనసాగుతున్న మూల రవీందర్ గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు బీజేపీ హైదరబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు సోమవారం పార్టీ నగర కార్యాలయంలో ప్రకటించారు. అంతకు ముందు పార్టీ డివిజన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న భీమనబోయిన నర్సింగ్‌రావుయాదవ్ 2022మే 30న అధ్యక్ష పదవికి, పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మండెపల్లి గంగపుత్ర సంఘం కార్యవర్గం ఎన్నిక

గోల్నాక, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్ కమలానగర్‌లోని మండెపల్లి గంగపుత్ర సంఘం భవనంలో సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండెపల్లి గంగపుత్ర సంఘం చైర్మన్‌గా మాల్ కాశీరాం, అధ్యక్షులుగా సందిరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మాల్‌యాదగిరి, కోశాధికారిగా మాల్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శివరాజ్, సాయిప్రసాద్, మాల్ రవీందర్, చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులుగా మురళీకృష్ణ, అనిల్‌కుమార్, మాల్‌శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నర్సింగ్‌రావు, రాంప్రసాద్, సునీల్, మల్లేష్, మాల్ శ్రీనివాస్, సలహాదారులుగా బాలరాజ్, లక్ష్మయ్య, రాజేశ్వర్, భూమయ్య బాలనర్సయ్య, యాదగిరి, లక్ష్మణ్, నర్సింగ్‌రావు, కార్యవర్గ సభ్యులు తదితరులను ఎన్నుకున్నారు.

10 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కరపత్రాల ఉద్యమం

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలో కరపత్రాల ఉద్యమం చేపట్టనున్నట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని సంయుక్త కిసాన్‌మోర్చా, కార్మిక సంఘాల జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రైతు సంఘాల నాయకులు డాక్టర్ హేమలత, డి.వెంకట్, సాయిబాబు, చొక్క రాములు, పాలడుగు భాస్కర్, జి.వెంకటేష్, భూపాల్, ఎస్.వి.రమణ, మల్లికార్జున్, విజయలక్ష్మి, రమేష్, జూలకంటి రంగారెడ్డి, సారంపల్లి మల్లారెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. బర్కత్‌పుర 11కేవీ పరిధిలోని బస్‌డిపో, రత్నానగర్, సత్యానగర్, బీజేపీఆఫీస్, అవంతి డిగ్రీకాలేజ్, కాచిగూడ జూనియర్ కాలేజ్, ఉడ్‌లాండ్ ఆస్పత్రి ప్రాంతాల్లో ఉదయం 9.30నుంచి 11.30వరకు, సీసీ ష్రాఫ్ పరిధిలోని బూమన్న గల్లీ, రాజేంద్రనగర్ కాలనీ, లింగంపల్లి ప్రాంతాల్లో ఉదయం 11.30నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, హర్రాజ్‌పెంట పరిధిలోని సుందర్‌నగర్, శ్యామ్‌నగర్, క్రిమటోరియం ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 4.30వరకు, నెహ్రూనగర్ పరిధిలోని కృష్ణానగర్, గోల్నాకచర్చి ప్రాంతాల్లో మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5 వరకు సరఫరా ఉండదన్నారు.

సంక్రాంతి పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లిలోని ట్రస్ట్ కార్యాలయంలో సంక్రాంతి పురస్కారాలు ప్రదానం చేశారు. నాట్యకళాకారులు అరుణ, ప్రజ్ఞ, టీవీ శిరీషలకు నగదు పురస్కారాలు, ఉషారాణి, ప్రవల్లికకు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. కవితావిభాగంలో రామకిషన్, రఘురామమూర్తి, ఝాన్సీ విజేతలుగా నిలిచారు. నిర్వాహకులు వైఎస్ఆర్ మూర్తి, నాట్యకళాకారిణి డా.పి.ప్రవీణ, కామేశ్వరి, ప్రసాదరావు, సాయిరామ్ పాల్గొన్నారు.

40 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలి

● ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 40వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ వేయాలని, రేషనలైజేషన్ పేరుతో మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను పునరుద్ధరించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన బీసీ ఉద్యోగుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో 25వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పీఆర్‌సీ కమిటీ రిపోర్టులో పేర్కొందని, వాస్తవానికి అన్ని ప్రభుత్వ శాఖల టీచర్ పోస్టులను పరిశీలిస్తే 40వేల ఖాళీలు ఉన్నాయని వీటన్నింటినీ భర్తీ చేయాల్సిన బాధ్యత సీఎం రేవంత్‌రెడ్డిపై ఉందన్నారు. ముఖ్యంగా ఏయిడెడ్ పాఠశాలలో 4900 పోస్టులు ఏళ్లతరబడి ఖాళీగా ఉన్నాయని అన్నారు. అదేవిధంగా 10వేల పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. 5వేల పాఠశాలలో 20 సంవత్సరాలుగా 5వేల ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ప్రతి ఉన్నత పాఠశాలకు ఒక కంప్యూటర్ చొప్పున నాలుగువేల ప్రభుత్వ పాఠశాలకు పంపించారని వాటికి టీచర్లను నియమించాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి పాఠశాలకు ఒక జూనియర్ అసిస్టెంట్ ఉండాలని ప్రభుత్వం ద్వారా సర్క్యులర్స్, ఇతర కరస్పాండెంట్ చేయడానికి విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడానికి జూనియర్ అసిస్టెంటు పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. పాఠశాలలో స్వీపర్లు 15వేల అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని అన్నారు, సమావేశానికి బీసీ నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ నీల వెంకటేష్ అధ్యక్షత వహించగా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు సి.రాజేందర్, జిల్లపల్లి అంజయ్య, అనంతయ్య, జి.కృష్ణయాదవ్, నందగోపాల్, రాందేవ్, జి.మల్లేష్‌యాదవ్, శ్రీమాన్, బలరాం పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన ఆప్ నాయకులు

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే పార్లమెంటు ఎన్నికలకు బీజేపీ నాయకులు కార్యకర్తలు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి వివిధ పార్టీల నేతలు బీజేపీలోకి స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారని తెలిపారు. బాగ్‌అంబర్‌పేటకు చెందిన ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రొఫెషనల్ వింగ్ కన్వీనర్ డాక్టర్ హరిచరణ్, ఫైనాన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ పుట్టా పాండు రంగయ్య తమ అనుచరులతో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు నాయకత్వంలో కిషన్‌రెడ్డి సమక్షంలో సోమవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీలో ప్రతి ఒక్కరికీ అవకాశాలు వస్తాయని చెప్పారు. మూడో సారి మోదీ పీఎం అవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండడి శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ యాదవ్, దాచేపల్లి సాయిసూర్య, సంగిశెట్టి నరేందర్, చిలుకూరి చంద్రమౌళి, చిట్టి పోలు శ్రీనివాస్, సుధాకర్, కందుల శ్రీనివాస్, సరళతో పాటు 200మంది ఆప్ నేతలు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సి కృష్ణయాదవ్, జి.ఆనంద్‌గౌడ్, పి.గోవర్ధన్‌రెడ్డి, అజయ్‌కుమార్, శ్యామ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా పొదుపు సంఘం సభ్యుల సమావేశం

నల్లకుంట, జనవరి8 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని రామకృష్ణనగర్ కమ్యూనిటీ హాల్‌లో మహిళా పొదుపు సంఘం సభ్యుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి జి.కావ్య కిషన్‌రెడ్డి హాజరయ్యారు.

కమ్యూనిజం, క్యాపిటలిజాలతో సమగ్రాభివృద్ధి సాధ్యం కాదు

● ప్రఖ్యాత విధానాల రూపకర్త సాం పిట్రోడా



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరడం శుభపరిణామని దేశంలో టెలికాం విప్లవానికి ఆద్యుడైన సాం పిట్రోడా అభివర్ణించారు. ఆయన రాసిన 'రీడిజైన్ ది వరల్డ్' పుస్తకానికి పోలిదాసు నరసింహారావు తెలుగు అనువాదం 'ప్రపంచానికి కొత్త రూపం ఇద్దాం కదలిరండి' పుస్తకాన్ని సోమవారం నగరంలోని ఓ హోటల్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ఆన్‌లైన్ వేదికగా సాం పిట్రోడా మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న అన్నీ ప్రజాస్వామ్య దేశాలలో నియంతృత్వం చోటు చేసుకొందని ఆయన వ్యాఖ్యానించారు. కమ్యూనిజం, క్యాపిటలిజం ... ఈ రెండు వ్యవస్థలూ ప్రపంచాన్ని సుఖంగా ఉంచలేవని, అవి మానవాళి సమగ్రాభివృద్ధికి తోడ్పడవని అభిప్రాయపడ్డారు. "కమ్యూనిజాన్ని వదిలి, ఇవాళ క్యాపిటలిజం నమూనాను ఎంపిక చేసుకున్నాం. అయితే, పెట్టుబడిదారీ వ్యవస్థలోనూ అంతకంతకూ అసమానతలు పెరగడాన్ని చూస్తున్నామని" సాం పిట్రోడా అన్నారు. ప్రజాస్వామ్యం పేరుతో పాలకులు సాగిస్తోన్న నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీలో చదువుతున్న సమయంలో తాను సాం పిట్రోడా ప్రభావానికి లోనైనట్లు తెలిపారు. "సాం పిట్రోడా 80ఏళ్ల వయసులోనూ ప్రపంచాన్ని మార్చడానికి, నూతన ఆవిష్కరణలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ క్రమంలో రోజుకు 16గంటలు శ్రమిస్తున్నారు. ఆయన అంకితత్వం, సృజనాత్మకత, అత్యున్నత ప్రతిభ, దార్శనికత లాంటివన్నీ నాకెంతో స్ఫూర్తినిచ్చాయి" అన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, విశ్రాంత ఐపీఎస్ సాంబశివరావు, ఎమ్మెల్యే మదన్‌మోహన్, ఎమ్మెస్కో ఎడిటర్ డి. చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు నాటికి సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

బర్కత్‌పుర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆగస్టు నాటికి సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు పనులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గౌడ ఐక్య సాధన సమితి అధ్యక్షుడు అంబాల నారాయణగౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను వి.శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించి మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహ నిర్మాణానికి రూ. 3 కోట్ల వ్యయంతో స్థలం కేటాయించిందని, ఆ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గౌడ కులస్థులకు కోకాపేటలో 5 ఎకరాల స్థలం, నిధులు కేటాయించి ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, గౌడ సంఘం నేతలు భిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను కల్లు గీత కార్మికులకు వర్తింపచేయాలన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

ముషీరాబాద్, అంబర్‌పేటలో ప్రజావాణి

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు అంబర్‌పేట, ముషీరాబాద్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయాలలో సోమవారం ఉదయం 10.30 నుంచి 1 గంట వరకు ప్రజావాణిలో డీఎంసీ మారుతిదివాకర్, డీఎంసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. అంబర్‌పేట సర్కిల్ ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు వచ్చాయి. అంబర్‌పేట ప్రజావాణిలో ఈఈ పేర్రాజు, ఏసీపీ వీరస్వామి, ఎలక్ట్రికల్ డీఈ వెంకట్రామ్‌రెడ్డి, ఏఎంహెచ్‌వో జ్యోతిబాయి. యూసీడీ ప్రాజెక్ట్ అధికారి రజిత, హార్టికల్ అధికారి భాస్కర్ పాల్గొన్నారు. ముషీరాబాద్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో డీఎంసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, ఏసీపీ రమేష్‌తోపాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ ప్రజావాణిలో ముషీరాబాద్ నుంచి ఒకే ఒక ఫిర్యాదు వచ్చింది.

'అనంతపూర్ జిల్లా పోలీసులపై చర్యలు తీసుకోవాలి'

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఏపీలో టీడీపీ నాయకుడు చంద్రమోహన్ విషయంలో అమానుషంగా ప్రవర్తించిన అనంతపూర్ జిల్లా పోలీసులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ డిమాండ్ చేశారు. సోమవారం రాంనగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనంతపూర్ జిల్లాలోని నిడపకలులో టీడీపీ నాయకుడు చంద్రమోహన్‌ను అకారణంగా కొట్టి అతన్ని దుస్తులు లేకుండా ఊరేగించిన పోలీసులపై రాష్ట్ర, జాతీయ మానవ హక్కుల కమిషన్‌లు చర్యలు తీసుకొని, వారిని సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

'దగ్గుమందులు కల్తీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి'

చిక్కడపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నాసిరకం దగ్గుమందులు, ప్లాస్టిక్ బాటిల్స్‌లో దగ్గుమందుల కల్తీ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నేషనల్ కమిటీ సభ్యులు రాష్ట్ర ఔషధ నియంత్రణ శాఖ జాయింట్ డైరెక్టర్ గుగులోతు రాంధన్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కమిటీ సభ్యులు సాంబరాజు చక్రపాణి, డా. పల్లెపాడు దామోదర్, మొగిలిపల్లి సుదర్శన్ మాట్లాడుతూ దగ్గుమందుల బాటిల్స్‌పై పూర్తి సమాచారం లేకుండా అధికమోతాదులో డిథిలైన్ గ్లైకాల్ కలవడం వల్ల చిన్న పిల్లల మరణాలు జరుగుతున్నాయన్నారు. అన్ని అంశాలను కూలంకషంగా విన్న గుగులోత్ రాంధన్ తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తామని దగ్గుమందుల సాంపిల్స్ సేకరణ చేపడుతామని హామీ ఇచ్చారన్నారు. దగ్గుమందు ప్లాస్టిక్ బాటిల్స్‌లో తయారీపై త్వరలో వినియోగదారుల సంఘాలు, ఔషధ తయారీదారులు, ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం : ఐద్వా

రాంనగర్ : బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పేర్కొన్నారు. ఈ కేసులో దోషులకు క్షమాభిక్ష మంజూరు చేస్తూ గుజరాత్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు కొట్టి వేయడంతో న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరిగిందన్నారు. గ్యాంగ్ రేప్, మర్డర్ కేసులో దోషులుగా ఉన్న 11మందిని తిరిగి జైలులో పెట్టాలని సుప్రీంకోర్టు పేర్కొనడం హర్షణీయమన్నారు.

'టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి'

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో వెంటనే విలీనం చేయాలని టీఎస్ఆర్టీసీ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.హనుమంత్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్‌సీలను విడుదల చేయాలని అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీఎస్ ఆర్టీసీ టీజేఎంయూ సెంట్రల్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కె.హనుమంత్ ముదిరాజ్ మాట్లాడుతూ,ఆర్టీసీ కార్మికులకు సంబంధించిన సీసీఎస్, పీఎఫ్, ఎస్ఆర్‌బీసీ, ఎస్‌బీటీ పెండింగ్ డబ్బులు మూడు వేల కోట్లను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షుడు డీవీకే రావు, సంయుక్త కార్యదర్శులు శీనయ్య, వి.సాములయ్య, రాష్ట్ర కార్యదర్శి పీకే మూర్తి, సంయుక్త కార్యదర్శి గోలి రవీందర్, ఎండీ అతీక్, నరేందర్, నాయకులు సంపత్‌కుమార్, చెన్నయ్య పాల్గొన్నారు.

'మాజీ హెల్త్ డైరెక్టర్ అక్రమాలపై విచారణ జరిపించాలి'

బర్కత్‌పుర, జనవరి8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర మాజీ హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు అవినీతి, అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జి.రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరావు అక్రమ పదోన్నతులు, నియామకాలు, వర్క్ ఆర్డర్లు, డిప్యూటేషన్లను కొనసాగించి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆయన హయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన అన్నారు. శ్రీనివాస్‌రావు అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా ఈ నెల 22న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించి వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సమితి నాయకులు మోహన్‌నాయక్, కుషానాయక్, రాందాస్ నాయక్, నెహ్రూనాయక్ పాల్గొన్నారు.

'కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలి'

బర్కత్‌పుర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి, అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు షేక్ జలీల్ డిమాండ్ చేశారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న ఇందిరాపార్కు వద్ద నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో లక్ష కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. 33 వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాల్సి ఉందని ఆయన అన్నారు.

18 నుంచి అండర్ 19 ట్వంటీ 20 క్రికెట్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీహెచ్, తదితరులు

బర్కత్‌పుర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 43వ ఆలిండియా రాజీవ్ గాంధీ మెమోరియల్ అండర్ 19 ట్వంటీ 20 లీగ్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 18 నుంచి 21 వరకు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ వి.హనుమంతరావు తెలిపారు. సోమవారం బషీర్‌బాగ్‌లోని ఫతేమైదాన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో క్రికెట్ చాంపియన్‌షిప్ బ్రోచర్‌ను వీహెచ్ ఆవిష్కరించి మాట్లాడారు. 14 క్రికెట్ జట్లు ఈ పోటీలలో పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ నెల 18న అంబర్‌పేట వాటర్ వర్క్స్ గ్రౌండ్‌లో శ్రీలంక - హైదరాబాద్ జట్లు తలపడనున్నాయని ఆయన తెలిపారు. ఈ క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పి.నారాయణస్వామి, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి, క్రికెట్ పోటీల నిర్వాహకుడు శంభుల శ్రీకాంత్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాం కళాశాలలో క్రీడా పోటీలు ప్రారంభం

బర్కత్‌పుర, జనవరి8 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో నిజాం కళాశాలలో క్రీడా పోటీలను ప్రారంభించారు. సోమవారం ఈ క్రీడా పోటీలను ఏబీవీపీ గ్రేటర్ కార్యదర్శి ఆర్.విష్ణువర్ధన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పృథ్వీతేజ ప్రారంభించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నిజాం కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ, నవీన్, రాష్ట్ర నాయకులు సాయి, రామకృష్ణ, నవీన్, మోక్షిత్, సాయి, శివరాజ్, భాస్కర్, నరేందర్, మణిదీప్, కమల్, పూజ, శ్రీవల్లి, సంహిత తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

ముషీరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ గంగపుత్ర కాలనీలో వికసిత భారత్ సంక్షేమ పథకాల ప్రచార రథాన్ని బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామ్‌సుందర్ గౌడ్, సీకే శంకర్‌రావులతో కలిసి ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికసిత భారత్ ద్వారా ముషీరాబాద్‌లోని అన్ని ప్రాంతాలలో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రచారం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర నాయకులు సదానంద్ ముదిరాజ్, జమాల్‌పురి నందు, పార్థసారధి, ఆర్.విశ్వం, నగర నాయకులు చంద్రమోహన్, అనిల్ కుమార్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'గ్యాస్ లీక్.. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి'

రాంనగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బూర్జుగల్లీ శ్రీహనుమాన్ దేవాలయం సమీపంలో సోమవారం తెల్లవారుజామున 5.30 గంటలకు గ్యాస్ లీకై ప్రమాదానికి గురైన బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గ్యాస్ లీకై ప్రమాదానికి గురైన బాధిత కుటుంబాన్ని ఆమె సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘటనను అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు ఆర్థిక సహకారం అందించేలా కృషి చేస్తామన్నారు.

అయ్యప్పస్వామి మహాపడిపూజ

చిక్కడపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం కార్పొరేటర్ కార్యాలయం వద్ద కన్నులపండువగా అయ్యప్ప మహాపడిపూజ నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్లు రచనశ్రీ, కొంతం దీపిక, వై అమృత, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు విశ్వేశ్వరయ్య, మద్దూరిశివాజీ, ఆనంద్, వెంకటేష్, మహేందర్‌బాబు, కలకోట అరుణ్‌కుమార్, ఎమ్మెన్ శ్రీనివాసరావు, ముఠా జైసింహ, శివముదిరాజ్ పాల్గొన్నారు.

'వారసులు లేని భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి'

బర్కత్‌పుర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వారసులు లేని 286 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఇ.టి.నర్సింహ విజ్ఞప్తి చేశారు. నకిలీ పత్రాలు సృష్టించి భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, భూమిని విక్రయించి వచ్చిన ఆదాయాన్ని పేదల సంక్షేమానికి ఖర్చు చేయాలని ఆయన కోరారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాలానగర్ మండలం కూకట్‌పల్లి గ్రామంలోని దివంగత నవాబ్ రయీస్ యార్‌జంగ్ బహదూర్‌కు చెందిన సర్వే నెంబర్ 1007లోని 286 ఎకరాల భూమి ఉందని, వారసులు లేకపోవడంతో ఈ భూమిని కొంత మంది కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. హైటెక్ సిటీకి అతి సమీపంలో ఉన్న ఈ భూమి విలువ 22 వేలా 880 కోట్ల రూపాయల ఉంటుందన్నారు. ఈ భూమి యజమాని 1960లో చనిపోగా అతని వారసులు కూడా చనిపోయారని తెలిపారు. అయితే, మనవుడి పేరుతో కొంత మంది ఈ భూమిని కబ్జా చేశారని ఆయన ఆరోపించారు. నకిలీ పత్రాలు, గిఫ్ట్ డీడీ డాక్యుమెంట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ భూమిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని విక్రయించి వచ్చే ఆదాయాన్ని పేదల సంక్షేమానికి ఖర్చు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూమి కబ్జాపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, సీ.హెచ్.శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

మెహిందీ కోసం వెళ్లిన మహిళ అదృశ్యం



నూర్జాహాన్ బేగం(ఫైల్)

కవాడిగూడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మెహిందీ తీసుకువస్తానని మార్కెట్‌కు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. గాంధీనగర్ ఏఎస్ఐ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ న్యూబోయిగూడ ఫ్లోరా హోటల్ వెనుక భాగంలో నివాసం ఉంటున్న అమీనా బేగం చెల్లెలు నూర్జాహాన్ బేగం (22) ఈ నెల 1న మెహిందీ తీసుకువస్తానని ఇంట్లో చెప్పి మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో గాంధీనగర్ పీఎస్‌లో నూర్జాహాన్ బేగం అక్క అమీనాబేగం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నూర్జాహాన్‌బేగంను ఎక్కడైనా గుర్తిస్తే వెంటనే గాంధీనగర్ పీఎస్‌లో సంప్రదించాలని ఏఎస్ఐ ప్రభాకర్ పేర్కొన్నారు.

ప్రాణం తీసిన సెల్ఫీ సరదా

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సెల్ఫీ దిగుతుండగా రైలు ఢీకొని ఓ బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. బొల్లారం రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ధానాపూర్ షాహపూర రాంపూర్ గ్రామానికి చెందిన ఉబేష్(16) బొల్లారంలోని బాబాయి ఇంటికి వచ్చాడు. సమీపంలోని రైలు పట్టాల వద్ద మైదానంలో ఆడుకునేందుకు ఆదివారం వచ్చాడు. పట్టాల వద్దకు వెళ్లిన ఉబేష్ రైలు వస్తున్న క్రమంలో సెల్ఫీ తీసుకుంటుండగా, రైలు ఢీకొట్టింది. బలమైన గాయాలతో ఉబేష్ అక్కడికక్కడే మరణించాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

కవాడిగూడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కవాడిగూడ పతంగ్ బిల్డింగ్ వద్ద సోమవారం జరిగింది. గాంధీనగర్ ఎస్ఐ కావ్య తెలిపిన వివరాల ప్రకారం... కవాడిగూడ పతంగ్‌బిల్డింగ్ వద్ద నివాసం ఉండే కె.మల్లేష్, తల్లిసక్కుబాయికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. చిన్నవాడైన కె.మహేష్(29) డ్రైవర్. కొంతకాలంగా మహేష్ అప్పుల బాధతో సతమతమవుతున్నాడు. సోమవారం ఉదయం అందరూ పనులకు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న మహేష్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొన్నాడు. మధ్యాహ్నం కుటుంబసభ్యులు ఇట్టికి వచ్చి చూడగా మహేష్ ఉరేసుకొని కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు గాంధీనగర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి క్లూస్‌టీంకు సమాచారం అందించి వివరాలు సేకరించారు. మహేష్ అప్పుల బాధతో ఉరి వేసుకున్నాడని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గాంధీనగర్ ఎస్ఐ కావ్య తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు యాచకులు మృతి

బర్కత్‌పుర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో అనారోగ్యంతో ఇద్దరు యాచకులు మృతి చెందారు. కాచిగూడ పీఎస్ పోలీసులు తెలిపిన ప్రకారం. కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని రిజర్వేషన్ కౌంటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(40) మృతి చెందాడు. శ్యాంబాబా మందిర్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై తమిళనాడుకు చెందిన మురళీ (35) భార్యతో కలిసి భిక్షాటన చేస్తూ ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్నాడు. సోమవారం అనారోగ్యంతో చనిపోయాడు. కాచిగూడ పోలీసులు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.